# పసుపు, కుంకుమ

కామాక్షమ్మ వంటగదిలోంచి ఇవతలికి వస్తూ విన్న పొలికేకలో స్తంభించి పోయి, ఏమీ తోచక క్షణం అలా నిలబడి పోయింది. ఇవాళ ఎందుకో మరీ నీరసము నిస్సత్తువా అనిపించి, గుండెలు ఉండి ఉండి గుబులుగుబులు మంటున్నాయి. ఈ కేక విని గబగబా వీధిలోకి పరుగెత్తింది. అప్పటికే పక్కింటి గుమ్మంముందు గుంపుగా జనం పోగుబడి ఉన్నారు. ఆమె గుండెలు వేగంగా కొట్టుకున్నాయి వెన్నులోంచి వణుకు పుట్టుకొచ్చినట్టయింది. "కొంప తీసి..." అన్న అర్థాంతరపుమాట మటుకు ఆమె నోటినుంచి వెలువడింది. ఆ కంగారులో మనసు వికలమైపోయింది. వీధి గుమ్మం తలుపు వేసి, చరచరా పెరట్లోకి వెళ్ళి గోడమీదనుంచి పక్కవాళ్ళింట్లోకి చూసింది. తను అనుకున్నంతపనీ అయింది!

కామాక్షమ్మ రెండు కళ్ళూ చెమ్మగిల్లాయి.

"వరలక్ష్మమ్మకి పసుపు, కుంకుమ...ఈ నాటితో సరి!"

ఈ మధ్య పదిహేనురోజుల్నించి వరలక్ష్మమ్మ భర్తకి అనారోగ్యంగానే ఉంది. పట్నంలో పేరున్న డాక్టరుగారే వైద్యం చేస్తున్నారు. ఎవరూ ఇంతలో ముంచుకు వస్తుందని అనుకోలేదు. అనుకోకుండానే ఇంత ఘోరం జరిగిపోయింది.

కామాక్షమ్మ చొరవగా లోపలికి ప్రవేశించి, స్పృహ తెచ్చుకుని తలబాదుకుంటూ రోదిస్తున్న వరలక్ష్మమ్మని గట్టిగా పట్టుకుని, "ఊరుకో తల్లీ...ఏం చేస్తాం...ఎంత ఏడ్చినా జరిగిపోయింది కలిసిరాదుగా," అంటూ అనునయవాక్యాలతో దుఃఖోపశమనం కల్గించాలని ప్రయత్నించింది. అంతవరకూ రెండుచేతుల్తో ముఖం కప్పుకున్న వరలక్ష్మమ్మ చేతులు ముఖంనించి తప్పించగానే, ఆమె ముఖంమీద చెదిరిన దమ్మిడీకాసంత కుంకుమబొట్టూ చూసేసరికి కామాక్షమ్మకి కన్నీరు ఆగలేదు. చివరికి ఓదార్చటానికి వచ్చిన తను కూడా మనసు చెదిరి కళ్ళనీళ్ళు గుక్కుకుంటూ చతికిలబడిపోయింది.

పోయినవ్యక్తి గుణగణాల గురించి మంచిగానే పదిమంది పది విధాల చెప్పుకున్నారు.

ఆ తర్వాత కొద్దిసేపట్లోనే, ఊళ్ళోనే ఉన్న దగ్గిర బంధువులు వచ్చారు. నేలని అలుముకుపోయి, గుండెలు బాదుకుంటూ రోదించే వరలక్ష్మమ్మని వాళ్ళు కూడా ఓదార్చలేకపోయారు. కొద్ది చనువుగా రెక్కలు పట్టుకుని వెనక్కిలాగి, అనునయించే దూరపుచుట్టాన్ని ఆమె విదిలించుకుని, భర్తశవం మీద విరుచుకుపడిపోయింది. ఈ దుఃఖతీవ్రతతో ముఖంమీద నరాలన్నీ వాచి, ఉబ్బిపోయాయి. గొంతు బొంగురుపోయింది. చెంపలు చారికలు కట్టాయి. దుఃఖమయమైన ఆ ముఖాన్ని, హృదయ విదారకమైన ఆమె అవస్థనీ చూడలేక కామాక్షమ్మ ఇంటికి వచ్చేసింది.

బావి దగ్గర తలారా స్నానంచేసి, ఆమైల బట్టలు వదిలి మూల పడేసి దేవుడుమందిరంలో దీపంతోబాటు ఇంట్లో దీపాలన్నీ వెలిగించి,

పురాణం
సూర్యప్రకాశరావు

రామనామస్మరణ చేసుకుంటూ వీధిగదిలో కొచ్చి గుమ్మంవార కూర్చుంది కామాక్షమ్మ.

పక్కింటిలోనుంచి, ఉండుండి ఆమె గొంతు వినిపిస్తూనే ఉంది. కామాక్షమ్మ ఆలోచనలో పడింది. "ఆడదానిజీవితం తామరాకుమీద నీటిబొట్టులాగ అంతలో ఉంటుంది కాబోలు. నిన్నటివరకూ మహాలక్ష్మి లాగా కలకలలాడుతూ కాళ్ళకి పసుపు రాసుకుని, నుదుట ఇంత కుంకుమబొట్టుతో పేరంటానికి వచ్చిన వరలక్ష్మమ్మ ఇవాళ ఇలా అయిపోయింది. ఒంటరిజీవి అయిపోయింది. పాతికేళ్ళ సాహచర్యం ఇవాళ్టితో తెగిపోయింది. ఇంతటితో ఆగిపోయినా బాగుండిపోను. ఈ చనిపోయిన మనిషితో తన సంబంధం తను చనిపోయేవరకూ వదలదు. తన స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు తగ్గించేసుకోవాలి, వికారరూపం తెచ్చిపెట్టుకోవాలి, భోజనం కూడా ఒక్కపూటే చెయ్యాలి. చొరవగా ఎక్కడికిపడితే అక్కడికి పోకూడదు చప్పున ఎవరికి ఎదురుపడినా, వాళ్ళు తప్పకుండా మనసులోనైనా విసుక్కుంటారు. కారణం లేకుండానే, ఏమీ అపరాధం చెయ్యకుండానే సమాజంలో తన గౌరవాన్ని పోగొట్టుకునే జీవచ్ఛవాలు స్త్రీలు. కొన్ని క్షణాల్లో వాళ్ళు ప్రపంచానికి దూరం అయిపోతారు. ఏనాడో అర్థాంతరంగా తన జీవితంలో ప్రవేశించి అర్థాంతరంగా తప్పుకునే వ్యక్తికోసం జీవితపర్యంతం అనేక త్యాగాలు ఆమె చేస్తూఉండాలి. ఒక్క ప్రాణంతప్ప సర్వం ఆమె వదులు కోవాలి. ఒకప్పుడు ఆమె ఆ ప్రాణాన్ని కూడా వదులుకోవలసి ఉండేది నిండు ప్రాణాన్ని భర్త శవంతోపాటు చితిలో వేసి కాల్చేసేవాళ్ళు. అలాంటి ఆచారాన్నికూడా సమర్థించేవాళ్ళు ఆనాడు లేకపోలేదు." కామాక్షమ్మ అంతటితో ఆలోచన ఆపేసింది. ఇంతటితో ఈ విషయం మర్చిపోవాలనే అనుకుంది. గట్టిగానే రామనామస్మరణ మొదలు పెట్టింది. కొద్దిసేపు దేవుడిముందు వెళ్ళి కూచుంది. గదిలో అటూ ఇటూ ఎందుకో తెలియకుండానే తిరిగింది. కాని మనసు మటుకు ఆధ్యాసనించి మళ్ళటం లేదు.

పూడుకుపోయిన గొంతు చించుకుని విలపిస్తోంది వరలక్ష్మమ్మ

కామాక్షమ్మకి ఆ గొంతు విన్నప్పుడల్లా, మనసు దిగజారిపోతోంది. భాగవతం ముందు వేసుకుని పేజీలు తిప్పింది. కాని ధ్యాస దానిమీదికి పోవటంలేదు. ఆమె చేసిన ప్రయత్నాలన్నీ వ్యర్థమైపోయాయి.

బయట బాగా చీకటి అయిపోయింది.

"బయటికి పోయినవాళు తొందరగా ఇంటికి పోదాం అనే ధ్యాస ఉండదు కాబోలు," అని భర్తమీద విసుక్కుంది.

మంచం వాల్చుకుని నడుంవాల్చినా కామాక్షమ్మ మెదడు ఆలోచించటం మానలేదు. ఆడది చచ్చిపోతే, టెంగురంగా అని నాలుగోనాటికల్లా మరొకతిని తెచ్చుకుంటాడు మొగవాడు. చనిపోయిన వ్యక్తికోసం అతను చెయ్యగలిగే త్యాగం అది! ఇటువంటి వాళ్ళని అనేకమందిని తను చూసింది, తన బంధువుల్లోనే ఇలాంటివాళ్ళున్నారు. తన మరిదిభార్య ఈమధ్యనే చనిపోయింది. బ్రతికి ఉన్నన్నాళ్ళూ నానా అవస్థలూ పడింది భర్త తిడితే పడింది; కొడితే పడింది. ఎవరినీ పల్లెత్తుమాట అని ఎరగదు. చనిపోయిన పదిహేను రోజులకి మరో ఆడదాని మెళ్ళో పుస్తెకట్టాడు, ఆ

# ★ పసుపు: కుంకుమ ★

మొగాడు! ఆడదానిస్థానం, విలువ, అంతలో ఉన్నాయి!! అయినా పెద్దవాళ్లు ఇలాంటి నియమాలూ, నిర్బంధాలూ ఎందుకు పెట్టినట్టు? —కామాక్షమ్మ ఆలోచనలకీ, అభిప్రాయాలకీ స్థిరత్వం లేదు. ఇటువంటి విశిష్టమైన అనుభవాలు తటసించినప్పుడు స్త్రీని గురించి కొంత విప్లవాత్మకంగానే ఆలోచనలు తడుతూంటాయి. కాని ఆ తర్వాత ఆమె ఎప్పటిమాదిరి అభిప్రాయాలకే వస్తూంటుంది.

తోటికోడలు పోయినప్పుడు ఆమె విచారించక పోలేదు. కాని ఆవిడ కాలనే 'అదృష్టవంతురాలు. పసుపు, కుంకుమతో వెళ్ళిపోయింది' అనే భావం కలిగింది. ఎవరికీ పట్టని అదృష్టం ఆమెకే పట్టినట్టుగా అనిపించింది. భర్త జీవించి ఉండగా ఇలా జరగటం సవ్యం; అందుకు విరుద్ధంగా జరిగితే అపసవ్యం అనిపించింది.

రాత్రి పదయింది. అంతవరకూ కామాక్షమ్మ ఓ చిన్న కునుకు తీసింది. పక్కింట్లోంచి ఏడుపు ఉన్నట్టుండి హెచ్చటంతో నిద్ర చెదిరిపోయింది. గడియారం వైపు చూసింది. ఇంతవరకూ ఈ ఇంట్లో ఒక్కతే ఉన్నదనే భావం స్ఫురించగానే, గుండెలు గుభిల్లుమన్నాయి. "ఈ ముసలాయన వేళకి ఇంటికి చేరకూడదూ! ఈ వయసులో ఇంకా పేట్లాట పిచ్చి ఏమిటి? ఆరోగ్యం చూసుకోవద్దూ? ఒచ్చే వయసా పోయే వయసా?" అని విసుక్కుంది. లేచి తలుపుతీసి వీధిలోకి చూసింది. పక్కింటి అరుగుమీద అయిదారుగురు కూచుని మాట్లాడుకుంటున్నారు. వీధి మొగలో కుక్కలు ఏడవటం మొదలెట్టాయి. కుక్కలు ఏడుస్తుంటే, కామాక్షమ్మకి గుండెల్లో నమిలి మింగే భయం. "అబ్బ! ఎవరైనా వాటిని అదిలించకూడదూ?" అనుకుంది. తలుపు వేసి వెనక్కి తిరగటానికి ఆమెకి ధైర్యం చాలేదు. పక్కింటి అరుగుమీద కూచున్న వాళ్ళ మాటలు వింటూ, అలాగే నిలబడి భర్తకోసం ఎదురుచూడసాగింది.


ఆయన వచ్చేసరికి రాత్రి పదకొండు దాటిపోయింది. రాగానే ఎన్నో అనాలనుకున్న కామాక్షమ్మ నోరైనా మెదపలేకపోయింది. ఆయన వస్తూనే, "ఎంతఘోరం జరిగింది!" అన్నారు.

"అవును. ఎవరూ ఇలా జరుగుతుందని అనుకోలేదు. నిన్నకూడా ఆవిడ్ని "ఎలాగున్నారండీ మీవారు" అంటే, తగ్గింది నే చెప్పింది. నిమిషాలమీద ముంచుకొచ్చేసింది. లక్ష్మీకళలా ఉండేది పాపం," అంది కామాక్షమ్మ.

"వీధి మొగలో ఎవరో కనిపించి చెబితే నమ్మలేదు. నిన్నకూడా వీధి అరుగుమీద కూచుని పలకరించాడే. ఎలాగుందంటే బాగానే ఉందన్నాడు. చూట్టానికి బాగానే ఉన్నాడు." ఇలాగ కొద్దిసేపు ఆయన చాలా బాధపడ్డాడు. పోయిన వ్యక్తి గుణగణాల గురించి కాసేపు ఇద్దరూ చెప్పుకున్నారు. బ్రతికిఉన్న వరలక్ష్మమ్మని గురించి కామాక్షమ్మ బాధపడితే, చనిపోయిన వ్యక్తిని తల్చుకుని, ఆయన పదే పదే వాపోయాడు.

భోజనం దగ్గరమటుకు కామాక్షమ్మ భర్తని కాస్త మందలించింది. "ఇదిగో చూడండి. ఇలా అర్ధరాత్రిదాకా తిండి, తిప్పలూ లేకుండా పేట్లాటలాడ్డం ఏమీ బాగుండలేదు. ఆరోగ్యం పాడవదూ? ఇప్పుడా అన్నంతినటం? మీపద్ధతి బొత్తిగా బాగుండలేదు," అంది.

"ఇంటిదగ్గర కూచుంటే తోచదే. అయినా ఇంట్లో కూచుని చేసేదేముందని చెప్పు. కాసేపు కులాసాగా ఆడుకుంటే అదో కాలక్షేపం."

ఆంధ్ర ఏజెంట్లు: మెసర్సు. పి. ఆర్. ట్రేడ్ ఏజెన్సీస్, విజయవాడ.

"అంతే అన్నమాట. ఒక్కతినీ బిక్కు బిక్కుమంటూ ఉంటాననే ఆలోచనలేదన్నమాట. ఇవ్వాళ ఎంత భయపడిపోయానో చెప్పలేను. పక్కనే ఇంత ఘోరం జరిగింది. పైగా వీధిలో కుక్కలేడుపు. ఇక చూసుకోండి ఎలాగుందో," అంది కామాక్షమ్మ మజ్జిగపోస్తూ.

ఆయన తలవంచుకునే నవ్వేశాడు "నా అంత ధైర్యస్తురాలు ఇంకెవరూ లేరంటావు," అంటూ ఎత్తిపొడిచాడు.

"బాగుంది. అటువంటప్పుడు ఎవరైనా భయపడతారు."

"నువ్వేమైనా చెప్పు. కబ్బుగుటుకు మానలేనే"

కామాక్షమ్మ తల మొత్తుకుంటూ. "చిన్నపిల్లలకంటే కనాకష్టం అయిపోతే, ఇక నేను చెప్పేదేముంది? పోనీ నాకోసం కాకపోయినా, మీ ఆరోగ్యం కోసమైనా నామాట వినండి," అంది ఆమె.

"నా ఆరోగ్యం గురించి నీకు బెంగ అక్కర్లేదు. తొంభైఏళ్ళదాకా నాకు మారకం లేదని ఇద్దరు జ్యోతిష్యులు చెప్పారు."

అర్థాంతరంగా అడ్డుపడుతూ, "అబ్బ అలాంటిమాట లనకండి నేను వినలేను," అంటూ కామాక్షమ్మ గోడకి జారబడిపోయింది.

అన్నం తింటున్నవాడల్లా, ఆయన హఠాత్తుగా, "అదేమిటి అలా పడిపోయావు! తల తిప్పుతోందా?" అంటూ లేచి, భార్య దగ్గరికి వెళ్ళి ఆమెను పట్టుకున్నాడు.

ఆమె క్షణం పోయింతర్వాత కళ్ళు తెరిచి గుండెలు రాసుకుంటూ "కాసిని మంచినీళ్ళు ఇవ్వండి.." అంది.

మంచినీళ్ళు తాగుతూ, "ఇవాళ నా మనసు బొత్తిగా పాడయిపోయింది," అంది.

ఆయన అనుకోకుండా, ఆ ప్రస్తావన తెచ్చినందుకు పశ్చాత్తాప పడ్డాడు. "నేనూరికే మాటవరసకన్నా" అన్నారు.

"అలాంటి మాట వినలేనండీ. ఇవాళ అసలు వినలేను," అంది కామాక్షమ్మ

ఆమె చెయ్యి ముందుకు జాపి, "రేపట్నుంచి వేళకి ఇంటికి వస్తానని మాట ఇవ్వండి. ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ చెయ్యనని మాట ఇవ్వండి," అంది.

ఆయన ఆమె ముఖంలోకి చూస్తే ఎక్కడో హృదయంలో ఊరి హృదయమంతా నింపి, కంటి కొలకుల్లో నించిన రెండు కన్నీటి బిందువులు దీపకాంతిలో తళుక్కుమన్నాయి. ఆమె కనురెప్పలు మూసింది. ఆ రెండు బిందువులూ రాలిపోయాయి.

ఆయన అయోమయంగానే తనచెయ్యితీసి ఆమె చేతిలో వేసి నవ్వుతూనే, "నువ్వెంత పిచ్చిదానివే ముసలమ్మా," అన్నాడు.

ముడతలుపడిన ఆమె పెద్దముఖం తేరుకుంది.

రాత్రి నిద్రపోయే ముందు, "ఈ మనుష్యులకి హృదయాలుండవు కాబోలు. ఒక చెంప భర్తని పోగొట్టుకుని తను ఏడుస్తుంటే ఆ చారాలంటూ మరింత కృంగదియ్యటానికి చూస్తారు. అలా ఆమె మానాన్ని ఆమెని వదిలెయ్యకూడదూ? భికారిని చేసి నలుగురూ అసహ్యించుకునేట్టు చేసేగాని, వాళ్ళ మనసుకి తృప్తిగా ఉండదు కాబోలు! అలా చేస్తేగాని దేముడు మెచ్చడా?" అంది.

"పెద్దవాళ్ళు అలా ఏర్పాటు చేశారు. ఈ నాటి ఆచారమా ఇప్పుడు మారటానికి! అందులో ఏ రహస్యం ఉందో ఎవరికి తెలుసు," అన్నారాయన.

"ఏమిఁ ఆచారమో! చూడలేం"

"ఇక పడుకుందూ," అంటూ ఆయన విసుక్కున్నారు

తెల తెలవారుతోందనగా కామాక్షమ్మ పెద్ద కేక పెట్టి లేచి కూర్చుంది. భర్త కంగారుగా లేచి, "ఏమిటే," అన్నారు.

"కలత నిద్ర అయిపోయింది. పీడకల వచ్చింది," అంది కామాక్షమ్మ. పెద్ద ఇసుక మైదానం. మైదానమంతా పరుచుకున్న తెలవెంట్రుకలు; వాటి మీద అక్కడక్కడ గుత్తులు గుత్తులుగా నలిపి విసిరేసినట్టుగా ఉన్న పూలు; అక్కడక్కడ కుప్పలు కుప్పలుగా, గుట్టలు గుట్టలుగా పసుపూ కుంకుమాను. ఉన్నట్టుండి, పెద్దగాలి రివ్వుమని వీచింది. పసుపూ, కుంకుమా పూలతో కలిసి రివ్వుమని తాడిఎత్తున, ఆకాశం మీదకు సుళ్ళుతిరుగుతూ లేచాయి. కోటి ఆడగొంతుల విషాదస్వరంలా ఆ గాలి గీపెట్టింది. ఆ స్వరం రామరామ తన్నే సమీపిస్తున్నట్టనిపించింది. ఆమెకి మెలుకువ వచ్చి పెద్దకేక పెట్టింది.

"అంత బెంబేలుపడిపోతే ఎలాగు? ఇటువంటివి ఎన్ని చూడలేదు? ఇవాళ కొత్త కాదుగా. అలా మనసు పాడుచేసుకుంటే ఎలాగు" అంటూ ధైర్యం చెప్పారాయన.

"అవును. ఎన్నో చూశాను. కాని ఈ మారు తట్టుకోలేకుండా ఉన్నాను. మనసు మళ్ళటం కష్టంగా ఉంది," అంది కామాక్షమ్మ.

ఇంతలో వీధిలోంచి పాలవాడికేకలు వినిపించాయి. ఆ వెంటనే పక్కింటిలోంచి వరలక్ష్మమ్మ విషాదసర్వమూ వినిపించింది. "అయ్యో మాతల్లీ! నీ బతుకంతా చీకటయిపోయిందికదమ్మా! ఈ వెలుగు నీకు కాదు తల్లీ," అనుకుంది కామాక్షమ్మ. రాత్రంతా నిద్రలేదేమో కళ్లు ఉబ్బిపోయి ముఖం ఉబ్బిపట్టయింది. మత్తుగా ఉండి ఒళ్ళుతూలటం మొదలెట్టింది.

పనిమీద ఆయన వెళ్ళిపోతుంటే, వీధి గుమ్మంవరకూ వచ్చి, "జాగ్రత్తగా నడవండి రోడ్డుమీద. మీకు అసలే పరాకు ఎక్కువ. వంట పెందరాళే అయిపోతుంది. తొందరగా వచ్చేయండి," అని పదే పదే హెచ్చరించింది కామాక్షమ్మ.

ఆయన నవ్వుకున్నారంతే! ఆయన వీధి మలుపు తిరిగేవరకూ గుమ్మంలో నిలబడి చూస్తూనే ఉంది. ఆయన ఎదురుగుండా ఓ బండి వస్తోంది. కామాక్షమ్మకి ఆదుర్దా ఎక్కువైంది. "ఆ వెధవబండి అలా మీది మీదకి వచ్చేస్తోందే! ఈయనకాస్త పక్కకి తప్పుకోరూ పెదూ? అది కొంపతీసి..."

అనవసరంగా ఆమె కంగారుపడింది కాని, ఆ బండి దూరంనించే వెళ్ళిపోయింది. అయినా ఏదో పెద్ద ప్రమాదం తప్పిపోయినట్టే అనిపించింది. ఈ పాడుమనసు ఇవాళ కీడు శంకిస్తూనే ఉంది.

రాత్రివచ్చినకల ఒక చెంప ఆమెని కలవరపెట్టసాగింది. "ఈ కల మంచిదవునో కాదో వీటిగురించి తనకంతగా తెలీదు. ఎవరినన్నా కనుక్కోవాలి," అనుకుంది. ఈ కలలంటే ఆమెకి గాఢమయిన నమ్మకం ఉంది తోటికోడలు పోయినప్పుడు ఇలాగే పీడకల వచ్చింది. ఇంటిగోడ గుభేలుమని కూలిపోయినట్లుగా కలవచ్చింది. అంతే! మర్నాడు తోటికోడలు పోయినట్లు ఉత్తరం వచ్చింది. ఇలాంటి నిదర్శనాలు అనేకం ఉన్నాయి. మామగారు పోయేముందు కూడా ఇలాంటి పాడుకలే వచ్చింది. నగ్నంగా ఒళ్లంతా నూనె రాసుకుని పేగులు పీక్కుతింటూ, గంతులేసే ఆకారాలు కళ్లో కనుపించాయి! తెల్లవారగానే, మామగారు పోయినట్టు టెలిగ్రాం రానే వచ్చింది. ఇంకా ఇలాంటివి ఎన్నో. ఇప్పుడామె రాత్రికన్న కలని మునుపటివాటితో పోల్చుకుంటే, ఇదేమీ తక్కువది కాదనిపించింది. "అయినా ఎవరినైనా కనుక్కుంటే మంచిది," అనుకుంది పని పాటలు త్వరత్వరగా తెముల్చుకుని వీధి చివరన ఉన్న ముక్కాళ్ళ ముసలమ్మ ఇంటికివెళ్ళి ఆవిడ చెవిని తనుకన్న కల యావత్తూ పూసగుచ్చినట్టుగా చెప్పింది. అంతా విని ఆమె అంది! "ఏం ఫర్వాలేదు. పక్కనే అటువంటి సంఘటన చూశావుకదూ! మనసు చెదిరితే ఇలాంటి కలలే వస్తూంటాయి. అయినా ఎందుకన్నా మంచిది, ఓ ముత్తయిదువుని పిల్చి పసుపూ, కుంకం, ఓ రవికలగుడ్డా పెట్టుకో. ఆ దోషమేదైనా ఉంటే పోతుంది," అని ఆమె సలహా చెప్పింది.

(55 వ పేజీ చూడండి)

# పసుపు, కుంకుమ.... ★

(19 వ పేజీ తరువాయి)

ఆమె చెప్పింది బాగానే ఉందనిపించింది [illegible] స్త మనసుకి ఊరట కలిగింది

మధ్యాహ్నం భర్త రాగానే ఆయన చెవిని వేస్తే ఆయన అభ్యంతరం చెప్పలేదు. "అలాగే ఇద్దువుగాని సాయంత్రం తీసుకొస్తాను" అన్నారు.

మర్నాడు ఓ ముత్తయిదువని పిలుచుకుని భోజనంపెట్టి కాళ్లకి పసుపురాసి నుదుట కుంకం బొట్టుపెట్టి ఇంత పసుపూ కుంకుమా, రవికెలగుడ్డా ఆమె చేతిలోపెట్టి దణ్ణం పెట్టుకుంది.

పక్కింట్లో దుస్సంఘటన జరిగి నాలుగు రోజులయింది. దీని ప్రభావం చాలా విశితంగా కామాక్షమ్మ చేసే ప్రతి ఆలోచన మీదా కనిపించసాగింది.

మధ్యాహ్నం భర్త ఆలస్యంగా ఇంటికి వస్తే ఎన్నడూ పడనంత కంగారుపడింది కామాక్షమ్మ. రాగానే ఆతృతగానే వంద ప్రశ్నలు వేసింది ఆయన విసుక్కున్నారు. ఆమె చిన్నబుచ్చుకుంది.

'నీ ధోరణి విపరీతంగా ఉంటోంది. ఎన్నడూ లేనిది నామీద ఇంత నిఘా వేశావేమిటి? చాదస్తం ఎక్కువయింది బయల్దేరే ముందు జాగ్రత్త! జాగ్రత్త! అంటూ వంద మార్లు హెచ్చరిక చేస్తావు. ఓ నిముషం ఇంటికి రావటం ఆలస్యం అయితే, నానా గొడవా చేస్తావు," అంటూ ఆయన చిరాకుపడ్డారు.

కామాక్షమ్మ తలవంచుకుని లోపలికి వెళ్లిపోయింది

ఈ వారం రోజుల్లోనూ భగవంతుడిమీద భక్తిప్రపత్తులు విపరీతంగా పెరిగిపోయాయి. పూజలూ, పునస్కారాలూ, మడి, ఆచారం అన్నీ వచ్చి పడ్డాయి

"నన్ను జాగ్రత్త, జాగ్రత్త అంటావు రోజల్లా ఇలా తడిబట్టలు కట్టుకుంటే, ఆరోగ్యం పాడవదూ? ఉపవాసాలు చేస్తే, మనిషి నీరసించిపోవూ?" అంటూ భర్త చేసిన మందలింపులు ఫలించలేదు.

"అలా అనకూడదు తప్పు" అని ఎదురు మందలించింది కామాక్షమ్మ

ఓనాడు, ఎవరైనా మంచివంశం చూసి చక్కని పిల్లవాడ్ని తెచ్చుకుని పెంచుకుంటే బాగుంటుందేమో అని పిస్తోంది" అంది.

భర్త ఈమాటలు వినిపించుకోలేదో, లేక, ఈ ఆలోచన వచ్చకనో మౌనం వహించారు.

కామాక్షమ్మ మళ్లీ రెటించింది

"ఎం... అమ్మా అని పిలిపించుకోవాలని కోరిగ్గాఉందా?" అన్నాడాయన నవ్వుతూ.

అయినో పడిలోపడ్డ కామాక్షమ్మ సిగ్గుపడి తలవంచేసుకుంది.

"ముసలమ్మ సిగ్గుపడితే, మాడముచ్చటగా ఉందే" అంటూ ఆయన పరాచికాలు ఆడారు

"ఏం నా ఆలోచన బాగుండలేదా? పెద్దవాళ్ళం అవుతున్నాం కొన్నాళ్లపోతే ఆసరా లేకపోతే, ఇద్దరికీ కష్టమే కాస్తో కూస్తో ఆస్తి ఉందాయె. మనతర్వాత మనపేరు చెప్పుకుని అనుభవించేందుకు ....!

"ఆస్తి అనుభవించేందుకు ఎవరూ ఉండరేమో అని దిగులుపడకు. కావాల్సినంత మంది వస్తారు."

"ప్రాణం మీదికొస్తే, గొంతులో నీళ్లు పోసేందుకైనా కావద్దుటండీ."

"అలాగా. ఆలోచిద్దాంలే. పడుకో"

అంతటితో ఆ ప్రసక్తి ఆగిపోయింది. "వరలక్ష్మమ్మది పాపం ఒంటరి బ్రతుకైపోయింది. కడుపున పుట్టకపోయినా ఎవర్నయినా పెంచుకుంటే బాగుండిపోయేది" అనుకుంది కామాక్షమ్మ.

తనలో ఏదో మార్పు వచ్చిందనీ, దీని ప్రభావంతనమీద గాఢంగా పనిచేస్తోందనీ అస్పష్టంగా అవ్యక్తంగా అనిపించసాగింది కామాక్షమ్మకి ఇదివరకెన్నడూ ముందురోజు గురించి ఆలోచించిఎరగదు. కాని ఈ మధ్య ప్రతినిముషం రాబోయే నిమిషాన్ని గురించే ఆలోచన

భోజనం చేస్తుంటే, ఈమాటా ఆమాటా వచ్చి ఎవరెవరికెంతెంత వయస్సు అనే సందేహం వచ్చింది "నాకు అరవై దాటుతుంది" అన్నాడు ఆయన.

"అబ్బే! మీకసలు రెండు మూడేళ్లు ఎక్కువ వేసి చెప్పుకోవటం సరదా! మీకు ఏభైఏడేళ్ళు! నాకు ఏలభై ఎనిమిది," అంది కామాక్షమ్మ వెంటనే

"నీ మొహం. నా వయస్సు నాకు తెలుస్తుందా నీకు తెలుస్తుందా? అరవై నడుస్తోంది ఇంక నెలాళ్లలో అరవై ఒకటి వస్తుంది" అన్నాడాయన మరింత పట్టుదలగా.

"కాదు ఏభైఏడే," అంది కామాక్షమ్మ.

"కాదు అరవై" అన్నారాయన చేతిలో ముద్ద కంచంలో వేసి

ఏసేమీ ఒప్పుకోలేదు కామాక్షమ్మ. చివరికి ఆయనే, "ప్రతిఆడదీ తన భర్త చాలా చిన్నవాడనే అనుకుంటుంది. వయస్సు కూడా రెండు మూడు సంవత్సరాలు తక్కువే చెబుతుంది ఇప్పుడు ఎందుకొచ్చిన వాదన? అరవై అయితే పోయే దేముంది?

# ★ సీతారామశాస్త్రిగారి అద్భుతచర్యలు ★

అయిపోయింది. తలపై చిన్న పింఛం, వెండి కడ్డీలా తెల్లని శరీరం, చిన్న పడగ, అరుణ నేత్రాలు, విషం క్రక్కుతూన్న నాలుక, మూరెడే మూరెడు పాము పుట్టలోంచి బయటికి వచ్చి తోకమీద నిల్చుని శాస్త్రిలుగారిని చూచి ఇటూఅటూ ఒకసారి తిలకించింది. ఆపూపుల వేడికి ఆగలేక చుట్టూ మూరుగజాల దూరంలో పెనుమంటలు లేచాయి. చెట్టూ చేమలూ దగ్ధమయిపోయాయి. ఆ సర్పరాజుదగ్గర శాస్త్రిలుగారు నరసింహావతారం ముందు ప్రహ్లాదుడులా చేతులు జోడించి, నతశిరస్కులై ప్రార్థన చేస్తున్నారు.

'మహాప్రభూ! అనంతమూర్తీ! తమ దర్శనం అసాధారణం. తరించాము. శాంతింపుండి. ఇది క్షుద్రలోకం. ఇలా దయచేయండి.' అంటూ శాస్త్రిల్లుగారు ముందు దక్షిణదిక్కుగా నడుస్తూ ఉంటే పార్శ్వభాముడులా ఆసర్పరాజు వెంట వెళ్లారు. అలా వెళ్ళి వెళ్ళి ఒక ఘుటమీంచి క్రిందికి దిగి అక్కడ ఒక పుట్ట చూపి ఇందులోంచి తమలోకానికి వెంచేయండి, ఆ బ్రాహ్మణప్రభువు కోరిక కాదనలేక తమరిని బయటికి ఆహ్వానించాను. దాసుణ్ణి క్షమించండి' అన్నారు ఒక్కసారి శాస్త్రిలుగారిని చూచి ఆ సర్పరాజు పుట్టలోకి పోయాడు

లక్ష్మీనరసింహాలుగారు శాస్త్రిలుగారి ప్రజ్ఞకి అమితానందం ఆశ్చర్యం పొందడం తప్ప ఏమీ చేయలేకన్నారు

పిశాచాలను దప్పించడం, వదలగొట్టడం, కరచినపామునే రప్పించి విషం తీయించడం శాస్త్రులుగారికి లెక్కలేనినిత్యకృత్యం.

ఆయన చూపిన మహిమలు అసాధారణాలు, ఎన్ని కుటుంబాలో వారు సజీవులై ఉన్నపుడు సర్ప పిశాచ బాధలనుండి విముక్తిని పొందాయి అవంగాలు మంత్రించియిస్తే, పాము విషం దిగిపోయేది. ఒక స్తంభం కట్టించి గారుడాన్ని, అందులో ప్రతిష్ఠిద్దామనుకొనేవారు మానవుల సహజ దౌర్భాగ్యంవల్ల ఆ పని పూర్తికాకముందే వారు దివంగతులైపోయారు. ★

# ★ పసుపు. కుంకుమ.... ★

ఏ భావిసయితే జరిగే దేముంది?" అన్నాడు భార్య ముఖంలోకి చూస్తూను.

కామాక్షమ్మ మనసులోనే సమాధానం చెప్పుకుంది. 'ముసలివాడు' అనే పదానికి, 'మృత్యువు' అనే పదానికి ఏదో దగ్గర సంబంధం ఉందనిపించింది. తనభర్త ముసలివాడు కాడని తృప్తిపడింది కామాక్షమ్మ.

* * *

ఏ విషయంలో అయితే అమిత శ్రద్ధా, భయం, ఆగుర్దా పెట్టుకుందో, అవ్యక్తంగా ఏ తలపైతే ఆమెని కృంగతీసి, నిత్యం నీడలాగ వెన్నాడుతూందో, అది నిజమవుతుందేమో అనే ప్రమాదస్థితి వచ్చిపడింది. నాలుగు రోజులు ముసురుపట్టి, ఎండపొడ లేకుండా ఒకటే వాన. ఈ నాలుగురోజుల్లో రెండు రోజులు పొద్దు కనిపించక కామాక్షమ్మ భోజనం చెయ్యలేదు.

భర్త మూలుగుతూ ఇంట్లో అడుగు పెడుతూనే మంచంమీద వాలిపోయారు. వీధిగదిలో మూలుగు విని కామాక్షమ్మ కంగారుగా బయటికి వచ్చింది. మంచంమీద పడుకుని మూలుగుతున్న భర్త ఒంటిమీద చెయ్యి వేసింది. పేలిపోతూంది జ్వరం.

కామాక్షమ్మకి గుండెలు గుభిల్లుమన్నాయి అరికాళ్ళలోంచి వణుకు పుట్టుకొచ్చింది నోట మాట పెగల్లేదు క్షణం పోయింతర్వాత తేరుకుని, "ఏమండీ! ఏమండీ!" అని పిలిచింది భర్తని.

ఆయన బాధగా మూలిగారు.

కామాక్షమ్మ జారిపోతున్న ధైర్యాన్ని ప్రయత్నంమీద నిలుపుకుంటూ, వీధిగుమ్మంలోకి వచ్చి ఎరిగున్న వాళ్ళెవరయినా కనిపిస్తారేమో అని చూడసాగింది. ఎగురింటాయన బయటికి వస్తుంటే, ఆయన్ని పిలిచి చెప్పింది. ఆయన వెళ్ళి డాక్టరుని తీసుకొచ్చారు. డాక్టరు వచ్చి చూసి ఫర్వాలేదు తగ్గిపోతుందంటూ మందిచ్చాడు. ఈ డాక్టరు చెప్పే, 'ఫర్వాలేదు' 'తగ్గిపోతుంది' అనే మాటలమీద ఇప్పుడామెకి నమ్మకం పూర్తిగా పోయింది. ఆమె నిలువునా కృంగిపోయింది.


శ్రీకాఫ్
దగ్గు, ఉబ్బసములకు
దివ్యౌషధము
శ్రీవత్స కెమికల్స్ & డ్రగ్స్
లిమిటెడ్, మద్రాసు-30


ఆమెకి తరుచు భర్త శవంమీద పడి విలపించే వరలక్ష్మమ్మే స్మృతికి రాసాగింది. ఆ దృశ్యమే ఎంతకాదనుకున్నా, కంటిముందు తిరుగుతోంది. ఏదో బెంగ ఆమె మనసుని పూర్తిగా ఆవరించింది. అవ్యక్తంగా ఆమె పడే బాధ ఇంతా అంతా కాదు. రాత్రి ఏ రెండింటికో భర్తపడుకునే మంచం కోడుకు తల ఆనించిపడుకుంది.

ఫర్వాలేదు రెండురోజుల్లో నయమవుతుందన్న డాకరు ఎనిమిది లంఖణాలు పడేసరికి ఇదవిటంటే, "చూదాం. చూదాం" అంటూ నసిగాడు. కామాక్షమ్మ అక్కడ నిలబడలేక పెరట్లోకి వెళ్ళిపోయింది

మర్నాడు మంచం వారగా నిలబడి, "ఏమండీ," అని పిలిచింది.

ఆయన నీరసంగా కళ్ళు తెరిచి ఏమిటన్నట్టు చూశారు. ఆయన ముఖంలోకి చూడలేక తన ముఖంలో విషాదం ఆయనకి కనిపించకూడదనే ఉద్దేశంతో వెనక్కి తిరిగి మందు కలుపుతూ, 'అసలు మీ కెలాగుంది? డాక్టరు ఫర్వాలేదు. తగ్గిపోతుందంటున్నాడు," అంది వణుకుతున్న పెదాలు అణిచిపెట్టుకుని.

ఆయన సమాధానం చెప్పలేదు, మూలిగాడు. మంగు పడుతూ, "ఇదిగో ఇటు చూడండి. అబ్బే!! అలా కన్నీరు పెట్టుకుంటే ఎలాగూ? ఫర్వాలేదు. తగ్గిపోతుంది అంది" కామాక్షమ్మ ఈ మాటలయితే గంభీరంగా అనగలిగింది గాని, లోపల గుండెలు గడగడమంటూనే ఉన్నాయి

ఆయన నీరసంగా చూస్తూ ఉండిపోయారు. సాయంత్రం డాక్టరు వచ్చి చూశాడు. వెళ్ళబోతూ "మీరు కంగారుపడుతున్నారు ఆయనకి మీరు ధైర్యం చెప్పాలి గాని ఇలా మీరే దిగులుపడిపోతే లాభంలేదు," అన్నాడు

ఆమె కన్నీరు అణుచుకుంటూ, రెండు చేతులూ జోడించి, "డాక్టరుగారూ పది కాలాలపాటు నా పసుపూకుంకుమా.." ఆపైన గొంతు పూడిపోయింది

ఆయన గట్టిగానే మందలించాడు "ఇలాగయితే వైద్యం చెయ్యటం కష్టం," అన్నాడాయన.

రాత్రి చాలా సేపటివరకూ కామాక్షమ్మ మంచాన్ని ఆనుకుని అలాగే కూర్చుండిపోయింది ఆమె మెదడు అనేక రకాల ఊహాచిత్రాల్ని చిత్రించింది. కోటి గొంతులు ముక్తకంఠంతో ఎలుగెత్తి రోదిస్తున్నట్టుగా ఆమె మనసు ఘోషపెట్టింది.

జ్వరతీవ్రతతో భర్త మూలగటం వినిపించి లేచి "ఏమండీ" అంది.

ఇలా కూర్చో అన్నట్టుగా సౌంజ్ఞ చేశాడాయన.

కామాక్షమ్మ రాయిలా మంచంమీద కూర్చుంది. చేష్టలుడిగిన ఆమెని చూసి ఆయనేదో చెప్పాలని ప్రయత్నం చేస్తున్నారు. చెప్పలేకపోతున్నారు. ముఖం ఇటూ, అటూ తిప్పుతూ, చివరికి "ధైర్యంగా ఉండు" అన్నాడు. ఇక చెప్పలేక బాధగా మూలిగాడు.

కామాక్షమ్మ లేవబోతే, ఆయన చెయ్యి పట్టుకుని లేవనివ్వ లేదు. ఆయాసంతో గుండెలు ఎగిరి ఎగిరి పడుతున్నాయి. బాధగా తల అటూ ఇటూ తిప్పుతున్నాడు.

కామాక్షమ్మ ఆయన చెయ్యి తీసిపక్కన పెట్టి, పొర్లుకొస్తున్న దుఃఖాన్ని అణిచిపెట్టుకుని తూలుతూ వంటగదిలోకి నడిచింది. నేలమీద పడి భోరుమని ఏడ్చింది. జుట్టు పీక్కుంది. తలమొత్తుకుంది దేవుడి విగ్రహం ముందు పడి గుండె బాదుకుని, కన్నీటితో అభిషేకం చేసింది ఆమె కంటికి ఎటువైపు చూచినా మృత్యుదేవత భీకరస్వరూపం కనిపించసాగింది ఒళ్ళంతా ముచ్చెమటలు పోశాయి ఆ ఉద్వేగంలో చేతి గాజులు రెండు పటుక్కుమన్నాయి.

తెలవారింది!!!

జ్వరం తీవ్రత తగ్గుముఖం పట్టి ముసలాయనకి కొద్ది కులాసా ఇచ్చింది ఆయన నీరసంగానే భార్యని పిలిచారు ఎంత పిలిచినా సమాధానం రాలేదు. ఎంతసేపు చూచినా మనిషి కనిపించలేదు

ఆయన ఓపిక చేసుకుని, మంచం [illegible] దేకుతూనే వంటగది దాకా వెళ్ళారు. తలుపు నెట్టారు. కాని గడియవేసి ఉంది. తలుపు సందులోనుంచి లోపలికి చూశాడు. ఒక్క ఊపున వీధిలోకొచ్చి పెద్దగా కేకవేసి కూలబడిపోయాడు. పదయేసరికి ఇంటిముందు గుంపులు గుంపులుగా జనం చేరసాగారు. ఎవరికితోచినట్టు వాళ్ళు చెప్పుకోసాగారు. పోలీసులు వచ్చింతర్వాత వంటగది తలుపులు బద్దలుకొట్టి, లోపలికి చొరబడ్డారు. వంటగదిలో మధ్యని నేలమీద వెల్లకిలా పడి ఉన్న కామాక్షమ్మని చూసి ఎక్కడివాళ్ళక్కడ నిలబడిపోయారు!

దేముడి విగ్రహం పక్కగా పల్లమందూ, నూనె కలిపిన ముద్ద పోలీసుల కంటపడింది.

కామాక్షమ్మ మృత కళేబరాన్ని ఇవతలికి తీసుకురావటానికి కదిపేసరికి ఆమె రెండు గుప్పిట్లూ సడలి ఒక గుప్పిట్లోంచి పసుపూ, రెండో గుప్పిటలోంచి కుంకుమా కిందపడ్డాయి. ★


Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1 Editor S Sambhu Prasad.